పచ్చడము

శ్రీ నేలటూరి వేంకటరమణయ్య

అభ్యంతర మందిరమునుండి మొగసాలలోనికి ప్రవేశించు వాకిటి కడ్డముగ వ్రేలాడుచుండిన తెర చెరగొకమూల కొంచెము వెనుక కీడ్వబడెను. కాకపక్షములతోడి బాలుని శిరస్సొకటి యందుండి వెలువడి మొగసాలను నలువంకల బరికించి చూచెను. తివాసీమీది యొరుగుల నానుకొని యర్ధనిమీలిత నేత్రుడై కూర్చునియుండిన వృద్ధుడు దక్క మరి యెవ్వరందు గానరాలేదు. వెండ్రుకలు పండిబారి యున్నను దేహదార్ఢ్యము సన్నగిలలేదు. ముఖము వాడుబారి ముడుతలు పడలేదుగాని కన్నులక్రింద సంచు లేర్పడినవి. కాని వర్చస్వంతమై సహజ దాక్షీకభావముచే విరాజిల్లుచుండినది. కొన్ని రెప్పపాట్ల కాలమూ వృద్ధుని పరికించి చూచినాడా బాలుడు. సందేహ ముప్పతిల్లు సన్నని యెలుగుతో "తాతయ్యా! తాతయ్యా!" అని పిలిచినాడు. కన్నులు విప్పిచూచినాడు తాతయ్య. ఆ బాలుని శిరస్సు దృక్పథమున పడినంతనే, యతని ముఖమున చిరునవ్వు మొలకెత్తినది. హెచ్చరించినాడు, "ఎవరోయి, చిన్న తిమ్మయ్యవా?" అని.

"అవును, తాతయ్యా!" అని బదులు చెప్పినాడు చిన్న తిమ్మయ్య.

"ఏమోయి సంగతులు? బడికి వెళ్లలేదా నేడు?"

"లేదు తాతయ్యా! ఈరోజు పున్నము, ఆట విడుపుకదూ!"

"అవునోయి మరచినాను. అయితే ఆట్లాడబోలేదేమి?"

"ఆటవిడుపు పద్యము ఒకటి వ్రాసిఇచ్చినారు అయ్యవారు. దానిని గట్టిచేసికొని యవ్వల బోవచ్చుననుకొన్నాను తాతయ్యా!"

"మరి గట్టిచేసినావా?"

"లేదు తాతయ్యా!"

"గట్టిచేయక ఏల వచ్చినావు?"

"అది వింతపద్యము తాతయ్యా!"

'అయిన గట్టిచేయవలసిన యవసరములేదా!'

'కాదు తాతయ్యా! దానిని చదివిన నవ్వువచ్చుచున్నది.'

"తిండికి మిక్కిలి ఘనుడను" వ్రాసియిచ్చినాడా అయ్యవారు?"

"లేదు తాతయ్యా! మిమ్మును గూర్చినదే!"

"నన్ను గూర్చినదా? అయిన నవ్వేల వచ్చుచున్నది? నాకు పద్యమును జెప్పించుకొనుటకు తాహత్తు చాలదా?"

"అదికాదు తాతయ్యా! ఎవరో మిమ్ము వేళాకోళముజేసి వ్రాసినారు"

వేళాకోళముజేసి వ్రాసినారా? ఏదీ, చదువు. చూతము! దంకమరుగున దాచియుండిన తాటియాకును బదులు, బఱచి సన్నగా: "వాకిటి కావలి తిమ్మా" అని చదువ ప్రారంభించినాడు. చిన్న తిమ్మయ్య; "హా! హా! హా! ఇదేనటోయి—నీ వింత యాటవిడుపు పద్యము?" అని యడిగినాడు వృద్ధుడు.

"ఏమి తాతయ్యా! మీకు గూడ వచ్చునా" యని యన్నాడు చిన్నతిమ్మయ్య.

రాకేమి విను.

"ప్రాకటముగ సుకవిజనుల పాలిటిసొమ్మా
నీకి బద్యముగొమ్మా
నాకీ పచ్చడమె చాలు నయముగనిమ్మా"

అని పద్యమును ముగించినాడు తాతయ్య.

"ఏమి తాతయ్యా దీనికి అర్థము?" అని యడిగినాడు చిన తిమ్మయ్య.

“అయ్యవారినిఅడుగకపోయినావటోయి?”

“అయ్యవారినే?”

“ఆయననే; అడుగకూడదా?”

“ఆయన కోపదారి తాతయ్యా! మీరు చెప్పండి తాతయ్యా, మీరు చెప్పరాదూ!”

“అది పెద్ద కథోయి—ఆకథను తెలిసికొన్న గాని పద్యము అర్థముగాదోయి ”

“మరీ మంచిది తాతయ్యా కథలు వినడమంటే నాకు బహు ఖుషీ.”

“కానీ, రాత్రికి చెప్పెదను.”

“ఇప్పుడెందుకు చెప్పకూడదు తాతయ్యా.”

“నీకొక్కడికే చెప్పినట్లయితే, అక్కయ్య, వీరప్ప, పాపతిమ్మయ్య వారందరు ఏమవుతారోయి”

“అయితే రాత్రికి తప్పకుండ చెప్పెదరా తాతయ్యా”

“ ఆ ”

౨

భోజనములైనవి—మామూలు ప్రకారము వచ్చి కూర్చున్నాడు తాతయ్య అభ్యంతరగృహములో తివాసీలమీద. చుట్టు ఆవరించికూర్చున్నారు పిల్లకాయలు. వృద్ధ సుమంగలి దోనమ్మగారు వెండి హరివాణమున పండుటాకులు, పచ్చిపోకలు, కర్పూర శకలములు, ఆణిముత్యపు సున్నము—కత్తి యడకత్తులతో భర్తకు తాంబూలము తెచ్చినది. వెంటనే వచ్చినది జలభరితమైన గిండి నెడను చంకనిడుకొని తమ్మపుటెకిని కుడిచేత బట్టుకొని యడపకత్తె. హరివాణమును క్రింద తివాసీమీద పెట్టి భర్త పాదముచెంత కూర్చున్నది దోనమ్మ, గిండిని దమ్మపుట్టికెను సమీపమునుంచి వెడలిపోవను దిరిగినది. అడపకత్తె అప్పుడు మెల్లగా దాతగారి కుడిప్రక్కకు జరిగివచ్చి అడిగినాడు చిన్నతిమ్మయ్య—“తాతయ్యా రాత్రి చెప్పెదనంటిరే’అని. తాతయ్యనోటి నుండి జవాబు వెలువడక ముందే “ఏమిటిరా, చిట్టిబాబూ!” అని విచారించినది దోనమ్మ. ఇంతలోనే తాతయ్య అందుకొని ‘కథ’ అని బదులు చెప్పినాడు.—”

‘కథా! తాతయ్యగారూ! చెప్పండి! చెప్పండి!’ అని దగ్గరించినారు వీరప్ప, పాప తిమ్మయ్య, ‘పసందుగానుండవలె తాతయ్యా’ అని హెచ్చరించినది చిన్నమ్మక్కయ్య.

‘ఏమిటండీ! ఆకథ!?’ యని దోనమ్మ అడిగినది.

‘నా పచ్చడముకథ నీవెఱిగినదే’

‘ఏపచ్చడమండీ? పచ్చడానికి కథయొక్కటి ఉన్నదా?’

‘రాయలదేవుడు నాకు బ్రసాదించిన పచ్చడమే, మరచితివా?’

‘రాయలదేవుడు మీకు ప్రసాదించినారా? ఏ రాయలదేవుడండీ! ఎప్పుడు, ఎందుకు, ప్రసాదించినాడు?’

‘అన్నట్లు మరచినాను. నీకెట్లు తెలియుగలదు? అప్పుడు నేనింకను పెండ్లాడనేలేదు. స్వామివారు సింహాసనమెక్కి నాలుగైదుమాసములైనది.’

‘మఱి పచ్చడముకథ ఏమిటండీ?’

‘వినండి చెప్పెదను. ఆనాడు సర్వశిరః ప్రధాని తిమ్మరుసయ్యగారి ఉత్తరువైనది రాయలదేవుని దర్శనమునకు ఎవ్వరిని ప్రవేశపెట్టకూడదని. జాము ప్రొద్దెక్కువరకు, ఎవ్వరిని, రాయలవారు పుష్పోదయమై నామతీర్థ సమయమున మామూలుగ హాజరగువారినిగూడ—చొరనివ్వలేదు. వాకిటి కడ్డము వేసిన గడెనొక్కసారియైన దింపలేదు. నగరిలోనికి వచ్చువారితో వాకిటివారు నోరుమూయక సంవాదము సల్పుచుండిరి. నగరి మోసాలమీది గడియారము ఎనిమిదిమారులు మ్రోగినది. అపుడు హజారంలో మూగియుండు బ్రాహ్మణ్యమును ఈవల నావల దొలగ ద్రోయుచు భటుండొకండు ముందురా నలుగురు వ్రామోలవచ్చి నిలిచిరి. వారిలో నిద్దఱు నాకు పరిచితులే అల్లసాని పెద్దయ్యంగారలు, ముక్కు తిమ్మయ్యంగారలు. వీరిద్దఱును రాయలవారికి నచ్చినకవులు. అందు పెద్దయ్యంగారలు యేలినవారికి బహిః ప్రాణము — వీరికి రాయలవారి సన్నిధి కెల్లవేళలయందును ప్రవేశముగలదు. అడ్డుపెట్టరాదని ఖండితముగ దేవరవారి యాజ్ఞ. తక్కినవారిద్దరిని నేనెఱుగను, వారు మొలకమీసాల యువకులు. వేషము జూడ వారును కవులనియే తోచినది. వీరినందరిని హజారములోనికి బ్రవేశపెట్ట వచ్చునా వలదా యన్నది గడ్డుసమస్యయైనది. ఒకప్రక్క రాయలదేవుని యాజ్ఞ, మఱియొకప్రక్క సర్వశిరః

ప్రధానిగారి యుత్తరువు నామనస్సును కలతవెట్ట జొచ్చినది. కాని దానిని వారె సత్వరముగ దీర్మానించిరి. నేను త్రొక్కటపడుచుండగనే వారు హజారము మెట్లు నెక్కి వచ్చిరి; యథాపూర్వము వాకిటి కడ్డము వేసియుండు గడెలను తీయక, పెద్దయ్యంగారితో 'అయ్యా! తిమ్మరసయ్యవారు......అనుచుండగనే వారు.'

"వాకిటి కావలి తిమ్మా!" యని చెప్పుచు గడెలను దొలగద్రోసికొని లోనికి వెళ్ళినారు. వారి వెనుక ముక్కు తిమ్మయ్యవారు

"ప్రాకటముగ సుకవిజనులపాలిటి సొమ్మా!?" అని వారిననుగమించినారు. తక్కినవారి నిద్దరిని పోనీ రాదని నిశ్చయించి గడెలనడ్డము వేసి దృఢముగ నిలచితిని. అప్పుడా యువకులలో నొకడు ముందుకువచ్చి

"నీ కీపద్యము గొమ్మా" యని చెప్పుచు గడెల సందున దూరి లోపల జొచ్చినాడు. నాకు కొంచెము కోపము వచ్చినది. అతని వెంబడించి పోయి పట్టివెనుక కీడ్చికొని రావలయునని బుద్ధిపుట్టినది. కాని నా స్థలమును విడచిపోయిన హజారములోని మూక కట్టతెగిన చెఱువునీటివలె లోనికి జొరబారుదురు. ఇట్లు చింతించుచుండగనే యా రెండవయువకుడు వచ్చి నా యెదుట నిలచి తేజోవంతమైన దృష్టిని మెఱుపుదీగవలె నాపై బ్రసరింపజేసి చిరునగ వంకురించుచుండిన వక్త్రమును విప్పి.

'నా కీ పచ్చడమె చాలు నయముగ నిమ్మా' యని నాపైనున్న పచ్చడమును దిగిచి వల్లెవాటు వేసికొని వాకిటి గడెలపై నెగిరిదాటి ముగ్గురి ననుసరించి నగరిలోనికి బోయెను.

అరగడియకాలము గడచినది. అవసరం వెంకటయ్య మొగసాలనుండి వెలువడి శీఘ్రముగ నా సమీపమునకు వచ్చి 'రాయలదేవుని యాజ్ఞయైనది, వాకిటి తిమ్మయ్యగారిని సముఖమునకు రమ్మని,' అని చెప్పినాడు. ఆమాట చెవిసోకగనే పుట్టిమునిగినట్లయినది నా స్థితి. తిమ్మరుసయ్యగారి యుత్తరువునకు వ్యతిరిక్తముగ నానలుగురు కవులను నగరిలో ప్రవేశింపనిచ్చినందులకు దగినశిక్ష ననుభవింపక తప్పదని యెంచి వెంకటయ్య నడిగితిని.

'ఏలినవా రెచ్చట నున్నా'రని.

'నామతీర్థమండపమున' అని యతడు బదులు జెప్పెను.

'దేవరవారి దర్శనమున కెవరైనను వచ్చియున్నారా?'

'పరాయివాండ్రెవ్వరు లేరు-అప్పాజీ తిమ్మరుసయ్యగారు, అల్లసానివారు ముక్కువారు. మఱియెవ్వరో ఊరుపేరు తెలియరాని పిల్లకవు లొకరిద్దఱు.

నాగుండె తటతట గొట్టుకొన నారంభించినది. ఏమి యాపదరానున్నదో! కాని రాయలయాజ్ఞ మీర గూడనిది కదా. కావున వెంకటయ్యను హజారమున నాస్థానమున గొంతతడ వుండుమని ప్రార్థించి, కాళ్లు ముందుకు సాగకున్నను, ఎట్లో బలవంతముగ వాని గదల్చుకొని నామతీర్థగృహము జేరితిని. అప్పటికి నామతీర్థము ముగిసినది. రాయలయ్యవారింకను నామతీర్థ పీఠముమీదనే కూర్చునియుండిరి. వారికి కుడివైపు కొంచెము ముందుగ పంచవర్ణముల జముఖాణముపై నొరగు నానుకొని కూర్చుని యుండినారు తిమ్మరసయ్య. ఆయన కెదుట ఏలినవారి వామపార్శ్వమున పద్మాసనము వేసికొని యాసీనులై యుండినారు పెద్దయ్య తిమ్మయ్యగారు. వారికి వెనుక చేతులు గట్టుకొని నిలచియుండిరా బాలకవు లిద్దరును. నేను రాయల సన్నిధానము జేరినంతటనే రెండు చేతులు శిరముమీద కెత్తి మ్రొక్కి నమ్రవదనుడనై నిలిచితిని. ఎవ్వరును నన్ను పలుకరింపరైరి. కాని స్వామివారు తీక్ష్ణదృష్టిని మొదట నామీదను తరువాత బాలకవులయందొక్కనిపై వల్లెవాటుగనున్న నాపచ్చడమువైపునను బరగించిరి. దేవరవారు వాక్రువ్వని యాప్రశ్నను గ్రహించితిని. మహామేధావి యాబాలకవి నోరెత్తి యాప్రశ్నకిట్లు సమాధానము జెప్పినాడు:

వాకిటి కావలి తిమ్మయ
ప్రాకటముగఁ గవిజనాళిపాలిటి సొమ్మే?
మా కవిత మెచ్చి యిచ్చెను
నా కీ పచ్చడము నరసవరపతి కృష్ణా!

ఈ పద్యము విన్నతోడనే రాయలవారి మనసునందలి కోపము మటుమాయమైనది. చంద్రోదయ సమయ నభస్థలమును బోలిన వారిముఖము ప్రసన్నత్వము నందినది. వాఙ్మయప్రపంచమున నిమగ్నులై 'మా కవిత' 'నాకీ పచ్చడము' అని రెండు మూడు

పర్యాయములు దమలో దాము వల్లించుకొని చివరకా బాలకవి నడిగినారు. 'ఎవ్వరండి ఆ 'మా'? యని— వెంట నే యతండు—

అల్లసాని పెద్దనార్య మహాకవి,
నంది తిమ్మ సుకవినాయకుండు,
భట్టుమూర్తి యేను బరగ నల్వుర మైతి
మార యంగ కృష్ణరాయభూప

అని జవాబు చెప్పినాడు. మరి 'నా' కర్థ మేమి? అని యడిగినారు రాయలవారు. అంతట నే నందుకొని హజారమున జరిగిన వృత్తాంతమును నివేదించితిని. రాయలదేవుని ముఖాంబుజము మందహాసముతో వికసించినది. అంతట పెద్దయ్యంగార్ల వంకముఖమై ఈబాలకవి ఎవ్వరు? అని యడుగ అవధరించినారు 'తిమ్మయ్య గార్ల శిష్యుడు. పేరు రామలింగము. జన్మస్థానము 'తెనాల్యగ్రహారము' అని పెద్దయ్యంగారు బదులు చెప్పినారు. 'రామలింగమా' అని యొక్కొక మాటను తనకు దాను నచ్చజెప్పినట్లూది పల్కినారు స్వామివారు. వారి భావమును గ్రహించి యా బాలకవి 'అవును దేవా, రామ—లింగమె' అని రాయలదేవు ననుకరించి తన నామధేయమందలి రెండు పదములను విడదీసి పలికి—

లింగనిషిద్ధుఁ గల్వచెలిం గని, మేచకకంధరుం ద్రిశూలిం గని, సంగతాళివలిం గని, కర్దమదూషితన్మృణాలిం గని, కృష్ణచేలునివాలింగని నీలకచక్ విధాత్ర్య నాలింగని రామలింగకవిలింగని, కీర్తిహసించు దిక్కులన్

అను పద్యము చదివినాడు.

'అబ్బ!' యని స్వామివారచ్చెరువుపడి, 'రామలింగకవిగారూ! మీ రింక కావ్యరచనకు ప్రారంభింపరాదా? అని ప్రోత్సహించినారు.

'దేవా, రచించినాడను, 'కందర్పకేతువిలాస' మను ప్రబంధమును - కవికల్పజము నీడ నాశ్రయించినాడను. ఇక నాకేమి కొదువ.

'దేవరవారి యాజ్ఞయైన కావ్యములెన్నిటి నైన రచియింప నేర్తును' అని యాతడు మనవి చేసికొనెను.

'కందర్పకేతు విలాసమా? పేరు పసందుగ నే యున్నది, కవిత్వమెట్టిదో'?

'దేవా! అది యేలినవారి వంటి ప్రాజ్ఞులు చెప్పతగిన విషయము' అని రామలింగకవి విన్నవించెను. అంత తిమ్మయ్యంగారివంక దృష్టిసారించి 'శిష్యుని కవిత్వ మెట్టిదో' యని విచారించినారు.

'సాహితీసమరాంగణ సార్వభౌములైన స్వామివారికి నేను నివేదింపగలనా? అట్లు నివేదించుటయు సరికాదు ఏలన శిష్యుడు పుత్రునివంటివాడు. పుత్రుని లోపములను తండ్రి వెలిబుచ్చునా?' యని తనవాస్తవాభిప్రాయము దెలియనీయక తిమ్మయ్యగారు జవాబు చెప్పినారు. రాయలదేవు డంతటితో తృప్తి నందలేదు.' వారు రచించిన కందర్పకేతు విలాసమును మీరు తిలకించలేదా'? యని యడిగిరి. 'మహాప్రభో! తిలకింపకేమి? పదపదమును విమర్శించి చూచియున్నాను' అని బదులు చెప్పినారు. "స్మరణమందుండిన ఒకటి రెండు పద్యములను జదువుడు — విన కుతూహలముగ నున్నది.—అంతట తిమ్మయ్యగారు యిట్లు పఠించిరి.

అక్కమలాక్షిఁ గన్గొనినయప్పటి
నుండియు నేమి చెప్ప నా
కెక్కడఁ జూచిన న్మదనుఁ డెక్కడఁ
జూచిన రోహిణీవిభుం

ఆర్ష రసాయనశాల
ముక్త్యాల, (కృష్ణా)
స్థాపితము 1925.
ప్రశస్తాయుర్వేదౌషధములకు నిలయము. ఏ మందు కావలసినను మాకు వ్రాయుడు. నమ్మకమైనవి లభింపగలవు
ఆయుర్వేదభూషణ
వేటూరి శంకరశాస్త్రి,
ఎ. ఎం. ఏ. సి.
Consulting Physician

ఎక్కడఁ జూచినం జిలుక
  లెక్కడఁ జూచిన కమ్మగాడ్పులిం
కెక్కడ నెట్టు లోర్వఁగల నీ
  విరహానలతాప వేదనన్

'పద్యము బిగువుగనే యున్నది భావము సామాన్యమేకదా!' అని సెలవిచ్చినారు. ఏలినవారు — తిమ్మయ్య బదులు చెప్పలేదు కాని మరల

లలితస్యాంబురహంబు నీలకచ గోలంబంబు
  నేత్రాసితో
త్పల ముచ్చైః స్తనకోక మోష్ఠవిలసద్బంధూక
  ముద్యత్కటీ
పులినం బుద్గత చిత్తజాతిరసవాః పూరంబు
  ప్రాణేశ్వరీ
జలజావాసము సొచ్చి యాడక
  మనోజాతానలం బాఱునే.

అని మరియొక పద్యము చదివినారు — 'ఎట్లూ! తిమ్మయ్యంగారూ పద్యమును మఱియొకసారి సెలవివ్వండి.' అని కోరినారు రాయలవారు. అంతట నా పద్యమును మరల పఠించినారు తిమ్మయ్యంగారు. 'బళి! బళి! యనుచు రాయలవారు లేచి నిలచిరి వారు లేవగనె తక్కినవారందరును లేచిరి. కృష్ణరాయలవా రంతట రామలింగకవి యొద్దికివచ్చి 'రామలింగకవి లింగని కీర్తి హసించు దిక్కులన్' అనిపల్కుచు తన కంఠమున నలంకరించియున్న మౌక్తిక హారమును దీసి యాతని మెడను వేసిరి.

3

'అర్థమైనదా చినతిమ్మయ్యా ఆటవిడుపు పద్యం?'

'ఆఁ కాని తాతయ్యా, కథ...'

'కథ కేమి? బాగుండలేదా?'

'అమ్మో బాబో! బాగులేకపోవడమే! బహు పసందుగానుంటే!'

'అయితే మఱేమి?'

'ఏమీ లేదు తాతయ్యా, కాని...'

'కాని? ఏమికానోయ్ కానిన్ని ముక్కానిన్ని?'

'..........'

'ఏమి పలుకవు?'

'మీకు కోపము వచ్చినది తాతయ్యా?

'కోపము లేదు తాపము లేదు, చెప్పవోయ్?'

'ఆ పద్యా లెందుకు తాతయ్యా?'

'బాగుగ లేవా?'

'ఏమో నే నేమెఱుగుదు? దారిలో ముండ్లకంపల వలె నున్నవి?'

ఓరి నీతస్సాగొయ్యా? ఎంతమాటన్నావురా!'

వారి సంభాషణకు అడ్డము వచ్చి అన్నది దొనమ్మ.

'వాడిమోర పద్యాలకేమండీ రత్నాలవంటివి; కాని—'

'కాని?'

'అరగొరగా జెప్పిన కథ అదేమి బాగు?'

'అరగొరా?'

'కాదా! పచ్చడమెట్లు పోగొట్టుకొన్న చక్కగా వివరించితిరి. మరి మీ కెట్లు దొరికినదో సెలవివ్వండి. ఇంతవరకు మీకథ యంతయు జీరయూడ్చి వేసి రవికె దొడిగిన స్త్రీ సింగారమువలె నున్నది.'

'చెప్పియుండలేదా ఇంతకుముందె రాయలవారు ప్రసాదించినదని?'

'ఆఁ చెప్పినారు - ఎందుకు ప్రసాదించిరో సెలవివ్వండి'

'అదా? పెద్ద కథ'

'పెద్దదా? పెద్దదైన వినుట కింపుగా నుండదా? కథకుడు నేర్పరియైన ఊకదంపైనను వింతయై యుండును. పోషణ పసందుగనున్న వస్తు వెంతటి యప్రశస్తమైనను కథ యెంత దీర్ఘమైనను హృదయాహ్లాదకరము గాకపోవునా?'

'ఊఁహూఁ! రసజ్ఞురాలవే'

'మీ ప్రసాదమువల్ల నేకదా!'

ఊఁహూఁ!'